


కార్యక్రమంలో మాట్లాడుతున్న అశోక్ దల్వాయి

# చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

## - కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి అశోక్‌దల్వాయి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : వాతావరణ అనుకూల పంటలు సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. సరైన వర్షపాతం లేకపోయినా కొందరు వరి, పత్తి, చెరకు, గోధుమ, సోయాబీన్ వంటి పంటలు సాగుచేసి నష్టాలపాలవుతున్నారన్నారు. వర్షాధార ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తే రైతులకు లాభసాటిగా మారి, మరోవైపు పోషక విలువలు గల ఆహార ఉత్పత్తి సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. రాజేందర్‌నగర్‌లోని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ మొదటి వ్యవస్థాపక దినోత్సవాన్ని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్(ఐఐఎంఆర్)లో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ అశోక్‌దల్వాయి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సీ పార్థసారథి, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రవీణ్‌రావు, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ విలాస్ ఏ తొనపి, ఐఐఎంఆర్ ప్రిన్సిపల్ సైంటిస్టు బీ దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్‌దల్వాయి మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. అధిక దిగుబడి కోసం విరివిగా వాడుతున్న ఎరువులు, పురుగుమందులతో దేశవ్యాప్తంగా 24మిలియన్ హెక్టార్ల భూమి సారం కోల్పోయినట్టు వెల్లడించారు. దేశ ప్రతిష్టను పెంచే ఎన్నో పరిశోధన సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయని పార్థసారథి తెలిపారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని 30శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు డాక్టర్ విలాస్ ఏ తొనపి పేర్కొన్నారు. అనంతరం చిరుధాన్యాల సాగుకు కృషి చేస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు, చిరుధాన్యాల ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్న వ్యాపారులను అవార్డులతో సత్కరించారు. ఐఐఎంఆర్ పాలసీ పేపర్, చిరుధాన్యాల వంటల పుస్తకం, పలు ఉత్పత్తులను ఆవిష్కరించారు.